ప్రజాశక్తి
బుధవారం 13 ఆగస్టు 2025
5
శ్రీకాకుళం



మిగులు సీట్లకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో మిగులు సీట్ల ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అంబేద్కర్ గురుకులాల జిల్లా సమన్వయకర్త జి.గ్రేస్ ప్రకటనలో తెలిపారు. కంచిలి, నందిగాం, పాతపట్నం, మందస ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీల్లో ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు. 5 నుంచి తొమ్మిదో తరగతి వరకు, ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలిపారు. బుధ, గురువారాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల మధ్య దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9701736862, 8331005217 సంప్రదించాలని సూచించారు.

ఉచిత ప్రయాణంపై ఉత్కంఠ

- 249 బస్సుల్లో ప్రయాణించేందుకు అవకాశం
- జిల్లాలో 11.03 లక్షల మంది మహిళలు
- రోజూ 1.20 లక్షల కిలోమీటర్లు తిరుగుతున్న బస్సులు
- 90 వేల కిలోమీటర్లల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి మహిళలకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం కల్పించడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా మహిళా ప్రయాణికులు చాలా ఆసక్తిగా చూస్తున్నారు. ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే మార్గదర్శకాలు వెలువరించడంతో, జిల్లా ప్రజా రవాణా అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యోగులకు ఇందుకు సంబంధించి శిక్షణ కూడా ఇచ్చారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించనున్నారు. ఉచిత ప్రయాణంతో తమ ఉపాధికి గండి పడుతుందని ఆటో, మ్యాక్సీకేబ్ డ్రైవర్లలో గుబులు రేగుతోంది.



ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2, టెక్కలి, పలాస డిపో పరిధిలో మొత్తం 310 బస్సులు ఉన్నాయి. రోజుకు సగటున 1.20 లక్షల కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తున్నాయి. ఇందులో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణించవచ్చని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. జిల్లాలో ఆయా కేటగిరీ బస్సులు మొత్తం 245 బస్సులు ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత బస్సులు సుమారు 90 కిలోమీటర్ల మేర ప్రయాణం సాగిస్తున్నాయి. రాష్ట్ర సరిహద్దుల వరకు మాత్రమే ఉచిత ప్రయాణానికి అనుమతిస్తారు. జిల్లా నుంచి ఒడిశాలో రాయఘడ, జయపురం, గుణుపూర్, బరంపురం తదితర ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులు నడుస్తున్నాయి. వీటిలో రాష్ట్ర సరిహద్దు స్టేజ్ వరకు ఉచితంగా ప్రయాణించవచ్చు. ఇందులో ఏదేని గుర్తింపు కార్డు చూపి ప్రయాణించవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో ఉచిత ప్రయాణానికి సుమారు 11 లక్షల మందికి పైగా అవకాశం ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

పల్లెలకు పోని పల్లె వెలుగులు


జిల్లాలో ప్రధాన రూట్లు మినహా చాలా పల్లెలకు బస్సులు లేవు. బస్సులు ఉన్నా ఉదయం ఒక సర్వీసు, రాత్రి ఒక సర్వీసు నడుస్తున్నాయి. ఉదాహరణకు శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి, కల్లేపల్లి గ్రామాలకు ప్రైవేట్ బస్సులు తప్ప ఆర్‌టిసి బస్సులను నడపడం లేదు. కొత్తూరు మండలం అంగూరు, ఆర్‌కె పురం, కడుమ ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులను నడపడం లేదు. వజ్రపుకొత్తూరు మండలంలోని ప్రధానమైన ఒంకులూరు గ్రామానికి పలాస నుంచి ఉదయం ఒక్క సర్వీసు మాత్రమే నడుస్తోంది. బూర్జ మండల కేంద్రమైనా అక్కడికి ఆర్‌టిసి బస్సు వెళ్లడం లేదు. గ్రామస్తులు ఆటోలను ఆశ్రయించి బూర్జ జంక్షన్‌కు వస్తున్నారు. అక్కడ నుంచి శ్రీకాకుళం, పాలకొండ ప్రాంతాలకు ప్రయాణిస్తున్నారు. సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు గ్రామానికి బస్సు లేకపోవడంతో భావనపాడు కూడలికి వచ్చి బస్సుల్లో ప్రయాణించాల్సి వస్తోంది.

ఆటో, క్యాబ్ డ్రైవర్లలో గుబులు

ప్రభుత్వం మహిళలకు ఆర్‌టిసిల్లో ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించడంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లలో గుబులు రేగుతోంది. తమ ఉపాధికి గండిపడుతుందని వారంతా ఆందోళన చెందుతున్నారు. శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, కోటబొమ్మాళి, పలాస, ఇచ్ఛాపురం, పాతపట్నం, కొత్తూరు, హిరమండలం మండల కేంద్రాల్లో స్థానికంగా తిరిగే ఆటోలకు ఇబ్బంది లేకపోయినా అక్కడ్నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే ఆటోలు, మ్యాక్సీకేబ్‌ల ఆదాయానికి గండి పడనుంది. ప్రధాన రూట్లలో సైతం ఆర్‌టిసి పరిమిత సంఖ్యలో బస్సులు నడుపుతుండడంతో ప్రయాణికులకు ఆటోలు, మ్యాక్సీక్యాబ్‌లే చాలా దిక్కవుతున్న పరిస్థితి నెలకొంది. ఉదాహరణకు అలికాం-బత్తిలి ప్రధాన రూట్‌లో బస్సులు నడుస్తున్నా, కొత్తూరు నుంచి బత్తిలి వరకు పరిమిత సంఖ్యలో బస్సులు ఉండడంతో ప్రజలు ఆటోలు, మ్యాక్సీక్యాబ్‌ల్లోనే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో తాము ఆదాయం కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధిని కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

వజ్రోత్సవాలకు వేళాయే..

- నేటి నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలు
- ముస్తాబైన సిక్కోలు



ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా వజ్రోత్సవ వేడుకలకు సిక్కోలు ముస్తాబైంది. ఈ వేడుకలు మూడు రోజుల పాటు పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. చరిత్ర గాథలు, సాంస్కృతిక వైభవం, ఆధునిక అభివృద్ధి... అన్నీ కలగలిసి ప్రతిబింబించేలా కార్యక్రమాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1950 ఆగస్టు 15న జిల్లాగా ఏర్పడిన శ్రీకాకుళం, ఈ ఏడు దశాబ్దాల ప్రయాణంలో వారసత్వాన్ని కాపాడుకుంటూ, అభివృద్ధిపథంలో అడుగులు వేసింది. శ్రీముఖలింగం శిల్పకళ, అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ గోపురం, తేలినీలాపురం వలస పక్షుల కిలకిలలు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పొందూరు ఖాదీ.. ఇవి ఈ నేల సాంస్కృతికకు సజీవ సాక్ష్యాలు.

మూడు రోజుల పండగ వేదికలు

మొదటి రోజు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం, కోడి రామ్మూర్తి స్టేడియంలో రన్ ఫర్ శ్రీకాకుళం, క్రీడా, సాంస్కృతిక పోటీలు, వ్యాపార, పారిశ్రామిక పెట్టుబడిదారుల సమావేశం, 'స్వర్ణ శ్రీకాకుళం' ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్, ప్రముఖుల సన్మానాలు, ఫుడ్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించనున్నాయి. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు పూర్తి కాగా, భద్రతా బాధ్యతలు పోలీస్ శాఖ నిర్వహిస్తుంది. ఈ వజ్రోత్సవాలు కేవలం వేడుకలే కాకుండా మన చరిత్రకు నివాళి, మన భవిష్యత్‌కు హామీగా నిర్వహిస్తున్నన్నారు. వజ్రోత్సవ వేడుకలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు పాల్గొనున్నారు.

వజ్రోత్సవాల షెడ్యూల్

13న ఉదయం 7 గంటలకు రన్ ఫర్ శ్రీకాకుళం ర్యాలీ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటలకు నాగావళి హోటల్‌లో పెట్టుబడిదారుల సమావేశం జరుగుతుంది. సాయంత్రం 5 గంటలకు కోడి రామ్మూర్తి స్టేడియంలో స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్‌కు శ్రీకారం చుడతారు.

14న ఉదయం 9 గంటలకు మున్సిపల్ హైస్కూల్ మైదానం, 7 రోడ్డు జంక్షన్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తారు. అదే సమయానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల (మెన్)లో వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్ పోటీలు జరుగుతాయి. సాయంత్రం 5 గంటలకు కె.ఆర్. స్టేడియంలో ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్ కొనసాగుతుంది.

15న ఉదయం 9 గంటలకు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు కె.ఆర్. స్టేడియంలో ప్రముఖుల సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఫెయిర్ అండ్ ఎగ్జిబిషన్ కూడా నిర్వహిస్తారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

సెప్టెంబరు 13వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసులను తగ్గించేందుకు ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. స్థానిక కోర్టులోని సమావేశ మందిరంలో జిల్లా పోలీసు అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. పోలీసులు రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే పోలీస్ యంత్రాంగానికి పెద్ద కేసులపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందన్నారు. మోటారు వాహన ప్రమాదాల కేసుల్లో బీమా సంస్థలు త్వరితగతిన న్యాయం చేయాలన్నారు. సమావేశంలో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, మూడో అదనపు జిల్లా జడ్జి సిహెచ్.వివేక్ ఆనంద్ శ్రీనివాస్, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఎల్ ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, ఎఎస్‌పి పి.శ్రీనివాసరావు, డిఎస్‌పి వి.వెంకటప్పరావు, పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

18న సిఎం చంద్రబాబు జిల్లా రాక!

పాసు పుస్తకాల పంపిణీకి శ్రీకారం

ప్రజాశక్తి - శ్రీకాకుళం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 18వ తేదీన జిల్లాలో పర్యటించనున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈమేరకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి జిల్లా కలెక్టరేట్‌కు మంగళవారం సమాచారం వచ్చినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన కచ్చితమైన తేదీని ఈనెల 15వ తేదీ తర్వాత ఫిక్స్ చేసి చెప్తామని, అధికార యంత్రాంగం సన్నద్ధమై ఉండాలని చెప్పినట్లు సమాచారం. ప్రాథమికంగా 18వ తేదీ అని నిర్ణయించినట్లు తెలిసింది. వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఫొటోతో కూడిన పాస్ పుస్తకాలను రద్దు చేసిన టిడిపి కూటమి ప్రభుత్వం, వాటి స్థానంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను పంపిణీ చేయనుంది. జిల్లాలో భారీ బహిరంగ సభను నిర్వహించి పాసు పుస్తకాల పంపిణీ ప్రక్రియను శ్రీకాకుళం జిల్లా నుంచే ప్రారంభించాలని నిర్ణయించినట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఈదుపురంలో సిఎం ప్రారంభించారు. మత్స్యకార భరోసా పథకాన్ని ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ప్రారంభించారు. ఇప్పుడు మూడోసారి పాస్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం చుట్టేందుకు శ్రీకాకుళం జిల్లానే వేదికగా చేసుకుంటున్నారు. జిల్లాలో ముఖ్యమంత్రి ఎక్కడ, ఎప్పుడు పర్యటిస్తారన్న షెడ్యూల్ ఖరారు కాకపోయినా, పర్యటన మాత్రం ఖాయమైందని అధికారులు చెప్తున్నారు.

నులిపురుగులను నివారిద్దాం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నివారిద్దామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రల పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉంటే పోషకాహార లోపం, రక్తహీనతతో నీరసపడతారని, శారీరక, మానసిక ఎదుగుదల లోపాలకు గురవుతారని తెలిపారు. అంగన్వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా ఇవ్వబడే అల్బెండజోల్ 400 మిల్లీగ్రాముల మాత్ర ద్వారా నులిపురుగుల సంక్రమణను సులభంగా నిర్మూలించవచ్చని చెప్పారు. జిల్లాకు అల్బెండజోల్ 400 మి.గ్రా టాబ్లెట్స్ 5,03,800 వచ్చాయన్నారు. ఈ టాబ్లెట్స్ జిల్లాలో మండల పరిధిలో పిహెచ్‌సి వైద్యాధికారి, ఎంపిడిఒ, ఎంఇఒ, సిడిపిఒ, సిఆర్‌పిల పర్యవేక్షణలో అన్ని పాఠశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు 8వ తేదీ నాటికి ఈ మాత్రలు పంపిణీ చేశామన్నారు. ప్రతి పాఠశాలకు ఒక ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షకునిగా నియమించినట్లు తెలిపారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల ఏవిధమైన దుష్పరిణామాలు ఉండవన్నారు. ఒకవేళ దుష్పరిణామాలు కనిపించినా సమీపంలోని పిహెచ్‌సి వైద్యాధికారిని సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా కొంతమంది పిల్లలు ఈ మాత్రలు తీసుకోకపోతే మళ్లీ వారం ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ మలేరియా నివారణ అధికారి బి.మీనాక్షి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కె.అనిత, డిపిఒ ఇ.వెంకటరావు, మలేరియా నివారణ మేనేజర్ అప్పలనాయుడు, మెడికల్ ఆఫీసర్స్, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి మాత్ర వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పులివెందులలో ప్రజాస్వామ్యం హత్య

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

పులివెందుల జెడ్‌పిటిసి ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం హత్యకు గురైందని మాజీ ఉప ముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య చరిత్రలో దీన్ని బ్లాక్ డేగా అభివర్ణించారు. తమ పార్టీ జెడ్‌పిటిసి అభ్యర్థి ఓటు హక్కు వినియోగించకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. ఇది పాలకుల చేతగానితనానికి, నిరంకుశత్వానికి నిదర్శనం. ప్రజలు ఓటు వేయకుండా అడ్డుకోవడం ఎన్నికల ప్రక్రియను హత్య చేసినట్లే అన్నారు. ఎంపీ అవినాష్ రెడ్డి అరెస్టు పూర్తిగా అక్రమం, రాజకీయ కక్షసాధింపునకు నిదర్శనమని విమర్శించారు. టిడిపి ఏజెంట్లు దాడులు చేస్తుంటే వారిపై చర్యలు తీసుకోకుండా, ప్రతిపక్ష నాయకులను అడ్డుకోవడం చూస్తుంటే పోలీసుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై న్యాయమూర్తి ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం తక్షణమే జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రిటైర్మెంట్, డెత్ బెనిఫిట్స్ సకాలంలో అందేలా చర్యలు చేపట్టి పోలీసు సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి అన్నారు. పోలీసు ఉద్యోగ విరమణ, ఉద్యోగస్తులు సర్వీసులో ఉంటూ మృతి చెందిన పోలీసు, హోంగార్డు ఉద్యోగుల కుటుంబ సభ్యులు సమస్యలు తెలుసుకుని పరిష్కార మార్గాలపై నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం సమీక్షించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాలు, పోలీసు సిబ్బంది సంక్షేమంలో భాగంగా జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులు, సర్వీసులో ఉంటూ మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు, హోంగార్డు కుటుంబసభ్యుల నుంచి సమస్యలు అడిగి తెల్సుకున్నారు. పోలీసు కుటుంబాలకు శాఖాపరంగా రావాల్సిన భద్రత, జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ, విడో, కార్పస్‌ఫండ్, అడిషనల్ కార్పస్ ఫండ్, గ్రూపు ఇన్సూరెన్స్ స్కీమ్, లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ నగదు వంటి వాటిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ బాధిత పోలీసు కుటుంబాలకు రావాల్సిన బెనిఫిట్స్‌పై సకాలంలో అందేలా ఉత్తరప్రత్యుత్తరాలు చేయాలన్నారు. పొందాల్సిన బెనిఫిట్స్ గురించి సరైన ధ్రువీకరణ పత్రాలు పోలీసు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఉద్యోగ విరమణ చేసిన పోలీసు ఉద్యోగులు, మరణించిన పోలీసు ఉద్యోగుల కుటుంబసభ్యులు వ్యక్తిగతమైన, శాఖపరంగా ఏ అవసరమున్నా తమను నేరుగా సంప్రదించవచ్చన్నారు. సమస్యలు ఉంటే తన ఫోన్ నంబరు 6309990800 తెలపాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి కె.వి రమణ, పరిపాలన అధికారి సిహెచ్.గోపీనాథ్, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆర్‌ఐలు కె.వి నర్సింగరావు, శంకర్ ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

మధ్యాహ్న భోజన పథకం మెనూ బిల్లులు పెంచాలి

ప్రజాశక్తి - రణస్థలం

మధ్యాహ్న భోజన పథకం మెనూ బిల్లులు పెంచాలని, వంట కార్మికులకు రూ.పది వేల వేతనం ఇవ్వాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రణస్థలం హైస్కూల్ వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలల ఏడు నెలల పెండింగ్ బిల్లులు, వంట కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఐదో తేదీ లోగా బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. అప్పులు చేసి వండిపెట్టిన కళాశాలల వంట కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకంలో పనిచేస్తున్న వారు అట్టడగు వర్గాలకు చెందినవారని, రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాల్లోని మహిళలని అన్నారు. నెలకు రూ.మూడు వేలు వేతనం ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని విమర్శించారు. ఆ వేతనాలు కూడా సకాలంలో చెల్లించడం లేదన్నారు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెరుగుతున్నాయని, నెలల తరబడి మెనూ బిల్లులు, వేతనాలు పెండింగ్‌లో ఉండటం వలన కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించాలని కోరారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా పాఠశాల విద్యార్థులకు మెనూ ఛార్జీలు కనీసం రూ.20 ఇవ్వాలని, కళాశాల విద్యార్థులకు రూ.30 ఇవ్వాలని కోరారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించి, పాఠశాల, కళాశాలలలో ఫస్ట్ ఎయిడ్ కిట్ ఏర్పాటు చేయాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పథకం అమలుకు కనీస మౌలిక సదుపాయాలు, వంట షెడ్లు, మంచినీరు కల్పించాలని, గ్లౌజులు, మాస్కులు, యాప్రాన్‌లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం మండల కార్యదర్శి వి.లక్ష్మి, డి.లక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మన్నాయుడు

ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి గానూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ, ఒసి తరగతులతో పాటు అనాథలు, హెచ్ఐవి బాధితులు, వికలాంగుల పిల్లలకు 25 శాతం కోటా కింద ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అభియాన్ ఎపిసి ఎస్.శశిభూషణ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆధార్, ప్రాథమిక వివరాలతో https://cse.ap.gov.in లో రిజిస్టర్ చేయొచ్చని... గ్రామ సచివాలయం, మండల విద్యా వనరుల కేంద్రం, పాఠశాల ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తుతో పాటు చిరునామా, జనన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. సీట్లను లాటరీ ద్వారా కేటాయిస్తారని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 1800 425 8599, ఆర్‌టిఇ జిల్లా నోడల్ అధికారి నంబర్ 9440484672 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.



కిరాణా దుకాణంలో తనిఖీలు చేస్తున్న చిన్నమ్మ

తూనికలో తేడాలొస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- పలాస

తూనికలో తేడాలు వస్తే కఠిన చర్యలు ఉంటాయని తూనికల కొలతల శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి.చిన్నమ్మ హెచ్చరించారు. పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో కిరాణా షాపులు, చికెన్, మాంసం, చేపల దుకాణాల్లో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సరకులతో పాటు తూకం సక్రమంగా ఉండాలని, దీనిపై జిల్లా వ్యాప్తంగా నిరంతరంగా దాడులు చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. పలాస-కాశీబుగ్గలో ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని, దీనికి చెక్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాటాల వ్యవహారంలో సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విలేకర్ల ప్రశ్నకు ఆమె సమాధానం ఇస్తూ కాటాలకు ప్రతిఏటా ప్రభుత్వ ముద్రలు వేసుకోవాలని, అటువంటి కాటాలనే వినియోగించాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో కాటా వర్కర్లు, సిబ్బంది కుమ్మక్కవుతున్నట్లు తమకు ఫిర్యాదులు ఉన్నాయని, ఇక నుంచి సరైన మార్గంలో నడవకుంటే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. చేపల దుకాణాల్లో 3 కేసులు నమోదు చేయగా చికెన్ షాపులు-2, ఫ్రూట్స్ షాపులు-1, హార్డ్వేర్-1, కిరాణాషాపులు-6, ఒక ఫర్నీచర్ షాపులను తనిఖీలు చేయగా తూకంలో తేడాలు రావడంతో 14 కేసులు నమోదు చేసామన్నారు. ఈ దాడుల్లో శ్రీకాకుళం ఇన్‌స్పెక్టర్, పలాస ఇన్‌ఛార్జి ఎ.బలరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ సెంటర్ పరిశీలిస్తున్న డిఆర్ఒ వెంకటేశ్వరరావు

తలసేమియా రోగులకు మెరుగైన వైద్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

తలసేమియా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న రెడ్‌క్రాస్ తలసేమియా బ్లడ్ ట్రాన్స్ఫ్యూజన్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా ఈ సమాజానికి ఎన్నో మంచి కార్యక్రమాలను అందిస్తున్నారని, ఇంకా రెడ్‌క్రాస్ సేవలను గ్రామస్థాయికి తీసుకెళ్లాలన్నారు. ఆరోగ్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వివరించారు. జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ ఈ సెంటర్‌ను మే నెలలో రాష్ట్ర గవర్నర్‌చే వర్చువల్‌గా, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో ప్రారంభించినట్టు తెలిపారు. ఇప్పటివరకు రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా 83 మంది తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు ఉచితంగా రక్తాన్ని అందించడం జరిగిందన్నారు. సంరక్షకులకు భోజనం, వసతి, రవాణా చార్జీలు ఉచితంగా ఇస్తున్నా మన్నారు. పిల్లలకు ఉచితంగా మందులు అందిస్తున్నామని వివరించారు. రెడ్‌క్రాస్ మెడికల్ అధికారి డా. వి.సచిత్ర, మేనేజర్ గోలివి రమణ, పి.సుజాత, ఉమాశంకర్, జగదీష్, ప్రియాంక, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్షలను పరిశీలిస్తున్న విసి రజని

న్యాయ విద్య సెమిస్టర్ పరీక్షలు పరిశీలన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల క్యాంపస్ కేంద్రంగా జరుగుతున్న మూడు, అయిదేళ్ల న్యాయవిద్యా కోర్సులకు సంబంధించి వివిధ సెమిస్టర్ల పరీక్షలను బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్. రజని మంగళవారం పరిశీలించారు. వర్సిటీ లా కళాశాల, లైబ్రరీ పాత భవనంలోని పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. ఎటువంటి విమర్శలకు తావులేకుండా, మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. నీటి వసతి, పరీక్షా కేంద్రాల్లో వెలుతురు, సిటింగ్ వంటివాటిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు వర్సిటీ రెక్టర్ ఆచార్య బి. అడ్డయ్య చీఫ్ సూపరింటెండెంట్ గా వ్యవహరిస్తున్నారు.

ట్రాక్టర్లపై సంబరాలా..?

ప్రజాశక్తి- నరసన్నపేట

ఒక వైపు ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, నీరు దొరక్క రైతులు అల్లాడుతుంటే... మరోవైపు కూటమి నాయకులు ట్రాక్టర్లపై సంబరాలు చేసుకోవడం అమానుషమని వైసిపి నాయకులు అన్నారు. మంగళవారం నరసన్నపేట వైసిపి కార్యాలయంలో ఎంపిపిలు ఆరంగి మురళీధర్, వాన గోపితో పాటు ముద్దాడ బైరాగి నాయుడు, చింత రామారావు గుప్త, జలుమూరు మండల అధ్యక్షులు కనసు సీతారాం, కలాపు రవి విలేకరులతో మాట్లాడుతూ గతేడాది రైతులకు ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ నిధులు పూర్తిగా నిలిపేశారన్నారు. ఈ ఏడాది కేవలం రూ.5 వేలే ఇచ్చి రైతుల కష్టాలపై పూస గుచ్చినట్టు చేస్తున్నారని మండిపడ్డారు. వరి మద్దతు ధర పూర్తిగా చెల్లించలేదని, ఎరువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, వర్షాభావం, కరువు కాటేస్తోందని, ఈ పరిస్థితుల్లో ఐదు వేల రూపాయలతో హంగామా చేయడం రైతుల రక్తంపై పూలమాల వేసుకున్నట్టే అని అన్నారు.

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం



ఇచ్ఛాపురం : మాత్రలను వేస్తున్న పిఒ రాజేశ్వరి

ప్రజాశక్తి- కవిటి

విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు అడ్డంకిగా మారిన నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మంచి ఔషధమని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, మాణిక్యపురం పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కె.ధనలక్ష్మి, ఎం.భాస్కరరావు, డాక్టర్ తేజ, డాక్టర్ రాకేష్ ఆచారి, డాక్టర్ వందిత అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు, చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజపురం పిహెచ్‌సి పరిధిలో 6232 మందికి, మాణిక్యపురం పిహెచ్‌సి పరిధిలో 2235, బొరివంక పిహెచ్‌సి పరిధిలో 2916 మందికి, బెలగాం పిహెచ్‌సి పరిధిలో 4140కి ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒలు అభిమన్యు సోయి, కె.వేణు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామదాసు సూచించారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా నందికొండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నులిపురుగు మాత్రలను మింగించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి ముఖలింగం, మండల వైద్యాధికారి ఎస్.సాహితీ ప్రియదర్శిని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మోహనరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని హరిపురంలో చిన్నారులకు ఐసిడిఎస్ పిఒ రాజేశ్వరి ఆధ్వర్యంలో నులిపురుగుల మందులను ఆశావర్కర్స్ ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని గోవింద పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వాహిని ప్రియాంక, డాక్టర్ వినయ్ కుమార్ అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా అంగన్వాడీ, పాఠశాల, కళాశాలల విద్యార్థులు 4805 మందికి వైద్యసిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం అర్.శ్రీనివాసరావు, టి.హేమారావు, వైద్యసిబ్బంది ఈశ్వరమ్మ, బమ్మిడి తేజ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నరసన్నపేట: మండలంలో మాకివలస పిహెచ్‌సి పరిధిలో డీవార్మింగ్ డే సందర్భంగా 17896 మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశామని డాక్టర్ శిరీషా తెలిపారు. అలాగే నరసన్నపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎంఇఒ శాంతారావు, దాలినాయుడు మాత్రలు పంపిణీ చేశారు.

కొత్తూరు: డీవార్మింగ్ డే సందర్భంగా 43 అంగన్వాడీ కేంద్రాలు, 45 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 2 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పంపిణీ చేశారు. 3608 విద్యార్థులకుగాను 3538 మందికి ఈ మాత్రలు వేశారు. కార్యక్రమంలో కురిగాం వైద్యాధికారి పెద్దిన ప్రసన్నకుమార్, చిల్డ్రన్ స్పెషలిస్ట్ డాక్టర్ రాకేష్. ఎంఇఒలు గోవిందరావు, శ్రీనివాస్, సూపర్‌వైజర్ బుచ్చిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



కవిటి : మాత్రలు వేస్తున్న డాక్టర్

పొందూరు: కింతలి, తాడివలస పిహెచ్‌సిల పరిధిలో డీవార్మింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త పి.ప్రకాశరావు పరిశీలించారు. ఈ సందర్భంగా కింతలి పిహెచ్‌సి పరిధిలో 3,813 మంది విద్యార్థులకుగాను 3,683 మందికి ఈ మాత్రలను వేశారు. దీంతో 96.5 శాతం మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డా.శివశంకర్ తెలిపారు. అలాగే తాడివలస పిహెచ్‌సి పరిధిలో 6,974 మంది విద్యార్థులకు గాను 7,237 మందికి మాత్రలు వేసి 96.33శాతం పూర్తి చేసినట్లు వైద్యాధికారి డా.నవీన్ నాగపవన్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బూర్జ : బూర్జ పిహెచ్‌సి పరిధిలో డీ వార్మింగ్ డే సందర్భంగా వైద్యాధికారి రాజశేఖర్ 1914 మంది పిల్లలకు మాత్రలు వేయించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ రామదాసు, జిల్లా డెమో బి.ముఖలింగం సందర్శించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజిని, సిహెచ్ఒ అప్పలస్వామి, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు, ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాల్లోనే ఓటర్ల జాబితా

ప్రజాశక్తి- పలాస

మున్సిపల్ ఎన్నికల్లో మున్సిపాలిటీల్లోనే ఓటర్ల జాబితా తయారవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. పురపాలక శాఖ డైరక్టర్, కమిషనర్ కార్యాలయంలో ఎపి ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాపై శిక్షణా తరగతులను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కమిషనర్ మాట్లాడుతూ ఫోటో, ఓటరు లిస్ట్‌లు మున్సిపల్ కమిషనర్ లాగిన్‌లోనే తయారవుతాయన్నారు. ముందు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ లాగిన్‌లో కొనసాగుతూనే కొత్తగా మున్సిపల్ కమిషనర్ల లాగిన్లలో కూడా పోలింగ్ బూతులు, వార్డులు, సచివాలయాల వారిగా ఓటరు లిస్టులు తయారవుతాయన్నారు. దీనివల్ల ఓటర్ల జాబితాలో తప్పులు దొర్లవని, ఉన్న వాటిని సరిచేయడానికి మార్గం సులబతరం అవుతుందన్నారు.

రాజులు చెరువు అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటలో ఉన్న రాజులు చెరువు అభివృద్ధికి అందరం కృషి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. మంగళవారం సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్‌తో కలిసి రాజులు చెరువు పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసన్నపేట పట్టణంలో కాలేజీ రోడ్డుకు ఆనుకుని ఉన్న రాజులు చెరువు అభివృద్ధి చేయాలన్నారు. నరసన్నపేట అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సత్యనారాయణ, పోలాకి మండలం టిడిపి అధ్యక్షుడు ఎం.వెంకట అప్పల నాయుడు, బైరి భాస్కరరావు, బలగ ప్రవీణ్ కుమార్, మెట్ట వైకుంఠరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి

ప్రజాశక్తి- బూర్జ

పాలకొండ - శ్రీకాకుళం ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. తరచూ ప్రమాదాలు సంభవించడంతో పాటు పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. ముఖ్యంగా బూర్జ మండలం మద్రిపాడు, లక్కుపురం గ్రామాల సమీపంలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై స్పందించిన ఆంధ్రప్రదేశ్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ మంగళవారం తన సొంత నిధులతో గోతులను పూడ్చారు. కేవలం గోతులు కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కొంతవరకైనా ప్రమాదాల నివారణకు తన వంతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు రామకృష్ణ తెలిపారు.

విజేతలకు బహుమతులు

టెక్కలి: శ్రీకృష్ణాష్టమి వేడుక సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మంగళవారం బహుతులు అందజేసినట్టు నిర్వాహకులు బొడ్డ అయ్యాబాబు తెలిపారు. 2 నుంచి పదవతరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు క్రీడా, పద్య, క్విజ్ పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల ప్రకాష్, చంద్రశేఖర్ పట్నాయక్, దల్లి వీరాస్వామిరెడ్డి, ఆట్ల వెంకటేశ్వరరావు, ప్రధాన హరిచంద్రరావు, యోగా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డిజె సౌండ్‌తో ఆరోగ్యానికి హాని

సోంపేట: ఊరేగింపులు, నిమజ్జనాల సమయాల్లో డిజె సౌండ్‌కు దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కొర్లాం జాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు రామ్ బుడ్డి గణపతి కోరారు. మంగళవారం ఆయన స్వగృహం వద్ద లైటింగ్, సౌండింగ్ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వినాయక చవితి పూజ కార్యక్రమాల సందర్భంగా నిమజ్జనాలు, ఊరేగింపు సమయాల్లో డిజె సౌండింగ్ లేకుండా సాధారణ సౌండ్ బాక్సులు వినియోగించేలా చూడాలని సూచించారు. డిజె సౌండ్‌తో గుండె జబ్బులు, అనారోగ్యంతో ఉన్నవారితో పాటు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో డిజె సౌండింగ్ సిస్టంలు వినియోగించకుండా ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో యాదగిరి, సంతోష్, శంకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు అన్యాయం చేస్తే సహించం



మాట్లాడుతున్న సింహాచలం

ప్రజాశక్తి- బూర్జ

పేద ప్రజలకు అన్యాయం చేసేందుకు పూనుకుంటే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగరాపు సింహాచలం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం మండలంలోని అన్నంపేటలో దళితులు, పేదలతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జోగిపాడు, వెంకటాపురం బౌండరీలో సర్వే నెంబర్ 3లో సుమారు 25 ఎకరాల భూమిని 75 ఏళ్ల నుంచి అన్నంపేట దళితులు, ఇతర బలహీన వర్గాలకు చెందిన పేదలు చదును చేసుకుని వ్యవసాయానికి అనుకూలంగా మార్చుకొని తమ కుటుంబాలతో జీవనాన్ని సాగిస్తున్నారన్నారు. ఇటీవల విశాఖపట్నంకు చెందిన మంగపల్లి సూర్యప్రకాశరావు అనే పెత్తందారు ఈ భూములపై తప్పుడు హక్కు పత్రాలను సృష్టించి 70 ఏళ్లకుపైగా సాగు చేస్తున్న దళితులు, బలహీనవర్గాల ప్రజలపై తప్పుడు కేసులు పెట్టి వేధించడం సరి కాదన్నారు. రెవెన్యూ యంత్రాంగం దళితులకు డీ పట్టాలు ఇచ్చి 50 ఏళు కావస్తున్నా ఆ భూములు కూడా పెత్తందారులవని తప్పుడు పత్రాలు ఇవ్వడం దారుణ మన్నారు. రెవెన్యూ అధికారులు సమగ్రంగా దర్యాప్తు జరిపి ఆ భూములపై వాస్తవంగా సాగు ఎవరు చేస్తున్నారో వారికి హక్కుపత్రాలు ఇవ్వాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని పేదలకు హక్కు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్.అప్పలనాయుడు, దంత సీతారాం, నేతల రమేష్, సూర్య నారాయణ, గణపతిరావు పాల్గొన్నారు.

చంద్రబాబు మహిళా పక్షపాతి

డిసిసిబి ఛైర్మన్ సూర్యనారాయణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం చంద్రబాబు నాయుడు మహిళా పక్షపాతి అని జిల్లా డిసిసిబి ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు, పింఛన్ల పెంపు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు ఇప్పటికే ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అలాగే మహిళలకు ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీని ఈనెల 15 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రకాల ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఏటా రూ.2 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం నెరవేర్చాలని సిఎం శ్రీకారం



మాట్లాడుతున్న డిసిసిబి ఛైర్మన్ సూర్యనారాయణ

చుట్టారన్నారు. ఇప్పటికే 700 కొత్త బస్సులను కొనుగోలు చేయడం జరిగిందని మరో ఎనిమిది వందల ఎలక్ట్రిక్ బస్సులు తొందర్లోనే కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ తమ్మినేని గీత, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పిఎసిఎస్ ఛైర్మన్ శిమ్మ మాధవి, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపదరావు మురళి, టిడిపి నాయకులు తోట రాము, కూన ఆంజనేయులు, తంగి శంకర్, గురయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ఎమ్మెల్యే గౌతు శిరీష



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, ఎన్నికల్లో ఇచ్చిన మాటను కట్టుబడి రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ డబ్బులను జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే గౌతు శిరీషా అన్నారు. అన్నదాత సుఖీభవ విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా టిడిపి కార్యాలయం నుంచి కాశీబుగ్గ వ్యవసాయ మార్కెట్ కమిటీ వరకు భారీగా ట్రాక్టర్లు, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కేవలం ప్రజల కోసమే పనిచేస్తుందని చెప్పడానికి అన్నదాత సుఖీభవ పథకమే నిదర్శనమన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించిన అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతుల ఖాతాల్లో మొదటి విడతగా రూ.7 వేలు జమ చేశామన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ప్రతి హామీని అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష ట్రాక్టర్ ర్యాలీ ప్రారంభించి ఆమె స్వయంగా ట్రాక్టర్ నడిపి కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో ఎపిటిపిసి ఛైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, ఎఎంసి ఛైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పీరుకట్ల విఠల్‌రావు, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

- శిథిలావస్థలో పోలీస్‌స్టేషన్
- పెచ్చులూడిన భవనం పైకప్పు
- బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ



శిథిలావస్థలో ఉన్న పోలీస్ స్టేషన్

రక్షకభటులకు రక్షణ కరువు

ప్రజాశక్తి- మెళియాపుట్టి


దశాబ్దాల క్రితం నిర్మించిన మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. భవనం నిర్మించి చాలా ఏళ్లు కావడంతో పైకప్పు పెచ్చులూడుతోంది. 1987 నవంబర్ 16న భవనం నిర్మించారు. సుమారు 38 ఏళ్లు కావడంతో భవనం ఎప్పుడు కూలిపోతుందోనని విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి భయం పట్టుకుంది. ప్రతి సంవత్సరం వర్షాకాలం వస్తే పోలీస్‌స్టేషన్ అంతా నీరు కారుతుంది. వర్షాలు పడే సమయంలో స్టేషన్‌లో ఉండటానికి కూడా భయపడుతున్నట్లు పలువురు సిబ్బంది చెబుతున్నారు. ఇటీవల సావిత్రి అనే మహిళా కానిస్టేబుల్ రిసెప్షన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో పైకప్పు పెచ్చులూడి తలపై పడి గాయాల పాలైంది. ప్రజలకు నిత్యం రక్షణ కల్పించే రక్షకభటులకు రక్షణ కరువైన పరిస్థితుల్లో మెళియాపుట్టి పోలీసులు ఉన్నారు. గతంలో మెళియాపుట్టిలో నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ ఆ నిధులతో కొత్తూరులో సర్కిల్ కార్యాలయం నిర్మించారు. ప్రస్తుతానికి ఎటువంటి నూతన భవనం నిర్మాణానికి అంచనా కూడా లేదు.



ఫిర్యాదుల విభాగం వద్ద పెచ్చులూడిన గోడ

క్వార్టర్స్ పరిస్థితి అంతే..


పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వారికి కుటుంబాలతో సహా ఉండటానికి 12 క్వార్టర్స్ సైతం ఉన్నాయి. అవికూడా శిథిలావస్థకు చేరి, వర్షంనీరు కారుతున్నాయి. పోలీసులు కుటుంబాలతో చాపర, మెళియాపుట్టి, పాతపట్నంలో అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. పోలీస్ క్వార్టర్స్ సమీపంలో పగలు, రాత్రి తేడా లేకుండా పాములు సంచరిస్తున్నాయి. నూతన భవనం నిర్మిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న పోలీస్ స్టేషన్ క్వార్టర్స్

జిల్లా విశిష్టతపై పోటీలు

నరసన్నపేట: శ్రీకాకుళం జిల్లా ఏర్పడి 75ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల నరసన్నపేటలో వివిధ రకాల పోటీలను నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల తెలిపారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డివిఇఒ పి. దుర్గారావు ఆదేశాల మేరకు జిల్లా సంస్కృతి చరిత్రను ప్రతిభింబించేలా చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్ణయించినట్లు పవన్ పేర్కొన్నారు. ఈ పోటీల్లో సారవకోట, పోలాకి, జలుమూరు, నరసన్నపేట మండలాలకు చెందిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలు జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక అవుతారన్నారు. అధ్యాపకులు శివరాం ప్రసాద్, సత్య నారాయణ, వేణు గోపాల రావు, నాగకుమారి, విశ్వప్రసాద్, ఆనంద రావు, రాంప్రసాద్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్టు తెలిపారు.




నరసన్నపేట : పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఇచ్ఛాపురం: బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, కెజిబివి, ఆదర్శ పాఠశాల విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవాన్ని పురష్కరించుకొని వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం విభాగంలో పోటీలు నిర్వహించారు. వ్యాసరచన విభాగంలో 100 మంది, చిత్రలేఖనం విభాగంలో 41 మంది, వక్తృతంలో 16 మంది పోటీపడ్డారు. ఇందులో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన వారికి జిల్లా పోటీలకు పంపించనున్నట్లు జూనియర్ కళాశాల (బాలురు) ప్రిన్సిపాళ్లు సిహెచ్ శరత్‌బాబు, శంకరరావు చెప్పారు.

పలాస: జిల్లా వజ్రోత్సవాలు సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నియోజవకర్గ స్థాయిలో వివిధ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు ఈ నెల 14న శ్రీకాకుళంలో జరుగు బహుమతులు అందించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ కె.నర్సింహమూర్తి తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

ప్రజాశక్తి- పొందూరు



రమణ (ఫైల్)

మండలంలోని తాడివలసకు చెందిన పూజారి రమణ (60) అనే రైతు పాముకాటుకు గురై చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈనెల 8న పొలంలో గడ్డి కోస్తుండగా రమణ చేతిపై పాము కాటు వేసింది. పొలంలో పడిపోయి ఉన్న రమణను స్థానికులు గుర్తించి గ్రామంలో ఉన్న పిహెచ్‌సికి తీసుకువెళ్లడంతో ప్రథమ చికిత్స చేసి హుటాహుటీన శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం వేకువ జామున మృతి చెందినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- కొత్తూరు

సీతంపేట మండలం నుంచి ఒడిశా రాష్ట్రం హుడ్డుబంగికి సీతంపేట మండలం జామితోట గ్రామానికి చెందిన జామి సంతోష్ 39.85 క్వింటాల రేషన్ బియ్యం అక్రమంగా వ్యాన్‌తో తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ బి.వి.వి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మాతల చెక్‌పోస్ట్ వద్ద దాడి చేసి పట్టుకున్నారు. అలాగే సీతంపేట మండలం జొన్నడుగూడకు చెందిన రవితేజ అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం 32.50 క్వింటాలను అదే చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజిలెన్స్ సిఐ తెలిపారు. ఈ దాడిలో సిఎస్‌డిటి సిహెచ్ భీమరావు, విఆర్ఒ రాజ గోపాలరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలు పట్టివేత

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని పారాపురం గ్రామానికి చెందిన మునుగోటి శేఖర్ అక్రమ మద్యం బాటిళ్ల షాప్ వద్ద ఉండటంతో సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ మంగళవారం దాడి చేసి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కెజిబివి ప్రిన్సిపాల్‌గా లలిత కుమారి

ప్రజాశక్తి- పొందూరు



లలిత కుమారి

మండలంలోని లోలుగు కెజిబివి ప్రిన్సిపాల్‌గా ఎస్.లలిత కుమారి బాధ్యతలు చేపట్టారు. ఈమె గార మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అలాగే ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన ఆర్.సౌమ్యను అధికారులు కంచిలికి బదిలీ చేశారు.

జగన్మోహన్ రెడ్డి దృష్టికి సమస్యలు



జగన్మోహన్ రెడ్డితో తిలక్

టెక్కలి రూరల్: వైసిపి కార్యకర్తలపై టిడిపి నాయకులు చేస్తున్న దాడులు, పోలీసుల ద్వారా వైసిపి కార్యకర్తలు, సాను భూతి పరులపై బనాయిస్తున్న అక్రమ కేసుల విషయమై వైసిపి జాతీయ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి దృష్టికి వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ తీసుకెళ్లారు. మంగళవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో జగన్మోహన్ రెడ్డిని తిలక్ కలిశారు. ఈ సందర్భంగా అక్రమ కేసులు బనాయించి కార్యకర్తలను వేధిస్తున్నారని, తమకు అనుకూలమైన అధికారుల ద్వారా పంచాయతీలు, మండల పరిషత్ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. మూలపేట, విష్ణు చక్రం నిర్వాసితులకు పోర్టు నుంచి రావాల్సిన బకాయిలు విడుదల కాకుండా అడ్డుపడుతున్నారని, పరిహారంపై నిలదీస్తున్న వారినిపై కేసులు పెడుతున్నారని జగన్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జగన్ మూలపేట, విష్ణు చక్రం గ్రామాలకు చెందిన వారిని తాడేపల్లి తీసుకురమ్మని చెప్పినట్టు తెలిపారు.

18న సంత వేలం పాట

కోటబొమ్మాళి: నారాయణవలస పశువుల సంతలో ఆశీల వసూళ్లకు సంబంధించి ఈనెల 18న స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో ఉదయం 10 గంటల నుంచి వేలం పాట నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు పాల్గొని ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాటను సొంతం చేసుకోవాలని ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు వేలం పాట నిర్వహించామని, పాట దారులు ఎవరూ హాజరు కాకపోవడంతో మరలా 18న వేలంపాట నిర్వహించడం జరుగుతుందన్నారు.

నవోదయ ఫలితాల్లో ఐశ్వర్య ప్రతిభ

రణస్థలం: ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన నవోదయ పరీక్షా ఫలితాల్లో రణస్థలం మండల కేంద్రంలో ఉన్న ఐరిస్ సాకల్య పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న లోచర్లపాలెంకు చెందిన సింక ఐశ్వర్య ప్రతిభను కనబర్చి నవోదయ సీటు సాధించింది. ఇదే పాఠశాల నుంచి గతంలో నవోదయ, సైనిక తదితర సీట్లు సాధించడం విశేషం. నవోదయలో సీటు సాధించిన ఐశ్వర్యను తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే ఎంఇఒ ఎ.త్రినాథరావు పాఠశాలను సందర్శించి ఐశ్వర్యను అభినందించారు. డైరెక్టర్ కోమనాపల్లి హరికృష్ణ, ట్రైనర్ సతీష్, కళా వెంకటరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

రణస్థలం రూరల్: ఆరోగ్య పరిస్థితులతో ఆర్థికంగా సతమతమవుతున్న పేదలకు సిఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పేర్కొన్నారు. నియోజకవర్గంలో సిఎం సహాయనిధి కింద అర్హులైన 25 కుటుంబాలకు రూ.22 లక్షల విలువైన చెక్కులను మంగళవారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. వైద్యఖర్చులు భారమై ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న వారి జీవితాల్లో సిఎం సహాయనిధి వెలుగులు నింపుతుందన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, లంక శ్యామలరావు, ముప్పిడి సురేష్, కుమరాపు రవికుమార్, పిసిని జగన్నాధం నాయుడు, పిన్నింటి మధుబాబు, కూనబిల్లి దామోదరావు, పిన్నింటి బానోజీనాయుడు తదితరులు ఉన్నారు.




డిపో ముందు నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

ఆర్‌టిసి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- పలాస

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నేషనల్ మద్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) అధ్యక్ష, కార్యదర్శులు హెచ్‌వి మూర్తి, ఎవి రావులు డిమాండ్ చేశారు. డిపో ఆవరణలో జోన్ సెక్రటరీ పిసకాస వాలీ అధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ తక్షణమే పిఆర్‌సి కమీషన్ ఏర్పాటు చేయాలని, వేతన సవరణ పూర్తయినందున ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను తక్షణమే చెల్లించాలని, రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, టెర్మినల్ ఎస్ క్యాష్మెంట్ చెల్లింపులు తక్షణమే చెల్లించాలన్నారు. పారదర్శకంగా బదిలీల పక్రియ అమలు చేయాలని, ఆఫీస్ సిబ్బందికి దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా ఎపి ఎన్‌జిఒ సంఘ అధ్యక్షులు బోనెల గోపాల్, కార్యదర్శి బి.ఉపేంద్రరావు, అసోషియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్, ఆర్‌టిసి నాయకులు ఎన్.పాపారావు, డి.శ్రీనివాసరావు, ఎల్ఎల్ ఆచారి, ఎస్.పార్వతీశం, గ్యారేజి కార్మికులు వున్నయ్య, డిఎల్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలలో జాబ్‌మేళాను మంగళవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్య సంస్థ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం జాబ్‌మేళాలను నిర్వహిస్తుందని, విద్యార్థులకు చదువుతో పాటు స్కిల్ ఉండాలని సూచించారు. ప్రభుత్వం యువతలో నైపుణ్యాల పెంపొందించేందుకు జిల్లాలో 8 నైపుణ్య అభివృద్ధి కేంద్రాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో 11 కంపెనీలకు సంబంధించి 500 ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఉరికి సాయికుమార్, కళాశాల డైరెక్టర్ సిహెచ్ దుర్గా ప్రసాద్, టిడిపి నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కూటమి నాయకులు, యువతీ, యువకులు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కళాశాల నిర్వాహకులు

కంప్యూటర్ కోడింగ్‌పై పోటీ పరీక్షలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న అన్ని కోర్సుల విద్యార్థులకు ఆ కళాశాలలోని నిర్వాహకులు టి.రమేష్, టి.రాజేష్, జి.విజయ్ కుమార్‌లు కంప్యూటర్ కోడింగ్‌కు సంబంధించిన కంపైల్ కాంక్యూర్ సి - ఛాలెంజ్ సాంకేతిక పరిజ్ఞానం, అభివృద్ధిపై మంగళవారం పోటీపరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభావంతులకు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి నాగేశ్వరరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ వై. రమేష్, టి.చలపతిరావు ఉన్నారు.



దోమల నివారణ మందులను పంపిణీ చేస్తున్న ఎంపిడిఒ

పారిశుధ్య పనులు నిర్వహించాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ప్రస్తుత వాతావరణంలో భాగంగా గ్రామాల్లో ప్రజలు వైరల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రపరచి, బ్లీచింగ్ చల్లించాలని, దోమల నివారణకు మందును అన్నిచోట్ల పిచకారి చేయాలని సూచించారు. అనంతరం దోమల నివారణ మందులను కార్యదర్శులకు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జె.అనందరావు, కార్యదర్శులు నరేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.శ్యాంసుందర్ ఆధ్వర్యంలో గ్రంథాలయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ జయంతిని జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రతి ఏడాది ఆగస్టు 12న జరుపుకుంటారని తెలిపారు. ఆగస్టు 12న 'నేషనల్ లైబ్రేరియన్ డే' గా జరుపుతూ గ్రంథాలయ రంగంలో ఆయన విశిష్ట సేవలను గుర్తు చేసుకుంటారని తెలిపారు. భారతదేశంలోని అనేక విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, గ్రంథాలయాలు వివిధ కార్యక్రమాలు, శ్రద్ధాంజలి, పుస్తకాల సదస్సులు వంటి కార్యక్రమాలు జరుపుకుంటాయన్నారు. ఈ సందర్భంగా రంగనాథన్ గ్రంథాలయ రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధ్యాపకులు శ్రీహరిరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆమదాలవలస : పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న ప్రిన్సిపాల్


టెక్కలి : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి రూపావతి

టెక్కలి: గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ జయంతి స్థానిక గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి బి.రూపావతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సహాయకులు అమ్మనమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి- కవిటి

కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ నిర్వహించారు. భారత ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు కళాశాల విద్యార్థులు జెండాలు పట్టుకుని ఊరంతా ర్యాలీగా సాగారు. భారత్ మాతాకీ జై, స్వతంత్ర భారతదేశం వర్థిల్లాలి, జాతీయ సమైక్యత వర్థిల్లాలి, వందే మాతరం వంటి నినాదాలతో విద్యార్థులు దేశభక్తి జ్వాలలు రేపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ సమైక్యతా భావం, సోదరభావం పెంపొందించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగరాల్సిందిగా పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, బి.అంజన, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పలాస: డిగ్రీ కళాశాల నుంచి ఇందిరా గాంధీ జంక్షన్ వరకు హర్ ఘర్ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని దేశభక్తిని చాటిచెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ పి.వెంకటరమణ, సైన్స్ విభాగ అధ్యక్షులు శ్రీనివాస్ పట్నాయక్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్లాట్‌ఫాంపైనే రైళ్లు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు రైల్వేస్టేషన్‌లో పలాస నుంచి విశాఖ పట్నం వెళ్లే ప్రయాణికుల రైళ్లన్ని మొదటి ప్లాట్‌ఫాంపైనే నిలుపుదల చేయాలని మండల పింఛనుదారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాళం పైడిరాజు, పి.ఎస్.ప్రకాశరావులు రైల్వే అధికారులకు కోరారు. రైల్వేస్టేషన్‌లో పలు సమస్యలు పరిష్కారం కోరుతూ మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, చిన్నారులు, మహిళలను దృష్టిలో ఉంచుకుని మొదటి ప్లాట్‌ఫాంపైన రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. 2, 3వ ప్లాట్‌ఫాంలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. విశాఖపట్నం వైపు వెళ్లే పలు పాసింజర్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లు మధ్యాహ్నం దాదాపు ఒకే సమయంలో వెళ్తున్నందున ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘ సభ్యులు బలివాడ గోవిందరావు, పి.దివాకర్ పాత్రో, ఎ.విజయ్‌కుమార్, బి.జనార్దనరావు తదితరులున్నారు.


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న పింఛనుదారుల సంఘ సభ్యులు

డిబేట్‌లో గంగోత్రికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి) విద్యార్థిని జె.గంగోత్రి (ఫైనల్ బికాం ఒకేషనల్) సమాచార హక్కుచట్టంపై రాష్ట్రస్థాయి డిబేట్ పోటీలో ప్రథమ బహుమతి సాధించింది. ఆర్‌టిఐ యాక్ట్ ప్రారంభించి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ పోటీలో కాలేజీ స్థాయి నుంచి ఎన్‌ఆర్‌సి, జోనల్ స్థాయిల్లో విజయం సాధించి, రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం దక్కించుకుంది. స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి. శామ్యూల్ చేతులమీదుగా బహుమతి స్వీకరించిన గంగోత్రిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.సూర్యచంద్రరావు, కామర్స్ శాకాధిపతి లబ్బ కృష్ణారావు, అధ్యాపకులు లలిత, సంతోషి పట్నాయక్, ఎస్.మాధవీలత, వాణీ కుమారి, సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి


నినదిస్తున్న ఎఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ రవి కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భవ సభ జరిగింది. సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లోకి విద్యార్థి నాయకులు, రాజకీయ పార్టీలకు అనుమతులు లేదని తీసుకువచ్చిన జిఒలు ఎవరి లబ్ధికోసమని ప్రశ్నించారు. ప్రభుత్వం బిసి, ఎస్‌సి, ఎస్‌టి హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా కాస్మోటిక్స్ ఛార్జీలు పెంచాలని, విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసే జిఒ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కె.సాయి, రాహుల్, నాయుడు, కుమార్ పాల్గొన్నారు.

శిలా శాసనాలతో చరిత్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శిలా శాసనాలతో చరిత్ర తెలుస్తుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని గుజరాతి పేటలో ప్రాచీనకాలంలో శ్రీకాకుళం పేరుగా 'సికకోలీ గడ' (సీకొలమ్ కోట) అన్న శాసనం మంగళవారం పరిశీలించారు. ఈ శాసనాన్ని పర్లాకిమిడి వాసి, స్వతంత్ర పురాభిలేఖ సోదకుడు (ఎపిగ్రఫిస్ట్), బిష్ణు మోహన్ గుర్తించి చదివారు. బిష్ణు ఇప్పటివరకు బెంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాచీన దేవాలయాలు, చారిత్రక కట్టడాల్లో లభ్యమయ్యే రాతి, చెక్క, లోహ శాసనాలను అధ్యయనం చేశారు. ఈ శాసనం 17వ శతాబ్దానికి చెందిన ఒక చారిత్రక రాజకీయ సంఘటనను కూడా నమోదు చేసిందని ఎమ్మెల్యే అన్నారు.


శాసన ప్రతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

యువతకు అవగాహన అవసరం

టెక్కలి: సమాజంలో యువత డ్రగ్స్ వినియోగం, హెచ్‌ఐవిపై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. అంతర్జాతీయ యువత దినోత్సవం సందర్భంగా మంగళవారం కళాశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన అవసరమన్నారు. కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ నేతాజీ, ప్రాజెక్టు నిర్వాహకులు మాధవరావు, హెల్త్ ఎడ్యుకేటర్ హరినాథ్, పార్వతి, హేమలత, రెడ్ రిబ్బన్ ప్రతినిధులు విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారానే సమాజంలో హెచ్‌ఐవి నుంచి విముక్తి కల్పించగలమని గెస్ట్ టిఐ ప్రోజెక్టు మేనేజర్ నిరంజనరావు అన్నారు. నేషనల్ యూత్ డే సందర్భంగా ఎపిఎస్ఎసిఎస్ ప్రోజెక్టు డైరెక్టర్ అదేశాల మేరకు టిఐ ఎన్‌జిఒ ద్వారా పలాస గెస్ట్ స్వచ్ఛంద సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల మేరకు ఎన్‌సిఎన్వెఎం డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు హెచ్‌ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ, అధ్యాపకులు పాల్గొన్నారు.


పలాస : పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

ఇది మోసాల ప్రభుత్వం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో చీడివలసలో మంగళవారం బాబూ ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అనేక అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క పథకాన్ని కూడా సక్రంగా నెరవేర్చడం లేదని, దానిపై దరఖాస్తు చేసుకునేందుకు కూడా లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి అమలు చేయకపోవడంతో బాధగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం వంటి ఎన్నో పనులు చేపట్టలేదన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, ఎంపిపి ప్రతినిధి నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కరణం కృష్ణం నాయుడు, ఎంపిటిసిలు గుమ్మడి రాంబాబు, శ్రీరామ్మూర్తి, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న రవికుమార్ తదితరులు

శక్తి యాప్‌పై అవగాహన


సోంపేట : మాట్లాడుతున్న సిఐ మంగరాజు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కాపు తెంబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం టెక్కలి డివిజన్ శక్తి టీం ప్రతినిధి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తి యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.జానకి రామయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నారీశక్తి యాప్‌పై స్థానిక సిఐ బి. మంగరాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో బాలికలు, మహిళలపై లైంగిక, భౌతిక దాడులు అధికమయ్యాయన్నారు. వీటి నుంచి రక్షణ పొందేందుకు నారీశక్తి యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ లవరాజుతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాహుల్ అరెస్టు ప్రజాస్వామ్యానికి మచ్చ

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాహుల్ గాంధీ చేపట్టిన ప్రజాస్వామ్య పరిరక్షణ యాత్రను అడ్డుకుని ఆయనతో పాటు ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి నాయకులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని కాంగ్రెస్ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు విమర్శించారు. మంగళవారం మండలంలోని కొర్లకోటలో విలేకరులతో మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో అవకతవకలు, పోలింగ్ శాతం పెరుగుదలపై రాహుల్ గాంధీ పోరాటం దేశ వ్యాప్తంగా మద్దతు పొందిందని, ఈ పోరాటానికి 300పైగా ఎంపీలు సంఘీభావం తెలియజేశారన్నారు. రాహుల్ ప్రశ్నలకు ఎన్నికల సంఘం, బిజెపి భయపడుతున్నాయని అన్నారు. అవినీతి చేయకపోతే పోలింగ్ శాతం పెరిగిన తీరును గణాంకాలతో వివరించాలని ఎన్నికల సంఘాన్ని, బిజెపిని డిమాండ్ చేశారు. వెబ్‌సైట్‌లో డేటా తొలగించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం చర్యలు నియంతృత్వానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. పోరాటం ఇప్పుడే మొదలైందని భవిష్యత్‌లో దేశవ్యాప్తంగా బిజెపి, ఎన్నికల సంఘం అక్రమాలను బహిర్గతం చేస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న అన్నాజీరావు

యాజమాన్య పద్ధతులు అవలంభించాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

రైతులు వరి సాగులో యాజమాన్య పద్ధతలు అవలంభించాలని ఎడి ఎల్.వి మధు సూచించారు. మంగళవారం రావులవలస, గోపాలపెంట గ్రామాల్లో ఎఒ సూర్యకుమారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి సాగులో ఎరువులు, కలుపు నివారణ, మందులు వాడకంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నందిగాం: రైతులు విధిగా పసల్ బీమాను వినియోగించుకోవాలని ఎఒ పి.శ్రీకాంత్ వర్మ అన్నారు. పెంటవూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. విఎఎ డి.అరవింద్, రైతులు బి.గిరి బాబు, అప్పలస్వామి, బి.త్రినాథరావు తదితరులున్నారు.



నందిగాం : పొల పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న ఎఒ, రైతులు

'మొదలవలస' పదవిపై గందరగోళం

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన రాష్ట్రస్థాయి నామినేట్ పదవుల విషయంలో నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. జిల్లా సీనియర్ టిడిపి నాయకులు, కాళింగ సామాజిక తరగతికి చెందిన జిల్లా టిడిపి కార్యాలయ అధికార ప్రతినిధి మొదలవలస రమేష్‌కు ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో చోటు లభించడంపై పలువురు అభినందనలు తెలుపుతున్నారు. గత 2014 - 2019 సంవత్సరం టిడిపి ప్రభుత్వంలో కూడా రమేష్‌కు రాష్ట్ర నీటి యాజమాన్య సంస్థ డైరెక్టర్‌గా పదవి కేటాయించారు. అయితే రాష్ట్ర కళింగ కోమటి కళింగ వైశ్య కార్పొరేషన్ మొదలవలసకు కేటాయించడంపై జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు టిడిపి, జనసేన, బిజెపి నాయకులతో పాటు రమేష్ శ్రేయోభిలాషులు అభినందనలు తెలుపుతూ కాళింగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కళింగ వైశ్య సామాజిక వర్గ కార్పొరేషన్ పదవి కేటాయించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై రమేష్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో నామినేటెడ్ పదవి కల్పించిన సిఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో తనకు కళింగ వైశ్య కళింగ కోమటి కార్పొరేషన్ కేటాయించడంపై తనకు కూడా అంతుచిక్కడం లేదన్నారు. ఏది ఏమైనాప్పటికీ తనపై ఎంతో నమ్మకంతో అధిష్టానం అప్పగించిన రాష్ట్రస్థాయి పదవికి న్యాయం చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.


మొదలవలస రమేష్